సాక్షి విజయనగరం

బుధవారం । 28 । మే । 2025



బెట్టింగ్ మాయలో పడి..!

ఐపీఎల్ బెట్టింగ్ ఉచ్చులో యువత చిక్కుకుంటోంది. ఓటమి అప్పులు తీర్చేందుకు దొంగలుగా మారుతున్నారు. కుటుంబానికి చెడ్డపేరు తెస్తున్నారు.

- 8లో



బడుగులపై పిడుగు

వాతావరణ ప్రభావంతో కురుస్తున్న వర్షాల సందర్భంగా పడుతున్న పిడుగులు బడుగులను ఆందోళనకు గురిచేస్తున్నాయి.

- 8లో

విజయనగర ఉత్సవాల నిర్వహణకు రూ.50లక్షలు

విజయనగరం అర్బన్: జిల్లా కేంద్రంలో ఏటా అక్టోబర్ నెలలో నిర్వహించనున్న విజయనగర ఉత్సవాలను పర్యాటక ఉత్సవంగా ప్రభుత్వం గుర్తించినట్లు కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ మంగళవారం తెలిపారు. ఉత్సవ నిర్వహణకు రూ.50 లక్షలు కేటాయించినట్టు పేర్కొన్నారు. ఈ మేరకు రాష్ట్ర పర్యాటక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్ జైన్ ఉత్తర్వులు జారీ చేశారన్నారు.

న్యూస్‌రీల్

స్లీపర్స్ సెల్స్‌తో పేలుళ్ల కుట్ర!

- ఎన్‌ఐఏ విచారణలో వెలుగుచూస్తున్న నిజాలు

విజయనగరం క్రైమ్: స్లీపర్ సెల్స్‌తోనే దేశంలోని ఏడు చోట్ల బాంబు పేలుళ్లు జరిపేందుకు పథకం రూపొందించినట్టు ఎన్‌ఐఏ (నేషనల్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ) అధికారుల విచారణలో విజయనగరానికి చెందిన సిరాజ్ ఉర్ రెహ్మాన్, హైదరాబాద్‌కు చెందిన సమీర్‌లు వెల్లడించినట్టు సమాచారం. విజయనగరం పీటీసీలో మంగళవారం ఐదో రోజు విచారణ దాదాపు పదకొండు గంటల పాటు సాగినట్టు తెలుస్తోంది. కోర్టు ఇచ్చిన ఏడురోజుల కస్టడీ గడువులో తొలుత రెండు, మూడు రోజులు నోరుమెదపని సిరాజ్, సమీర్‌లు నాలుగు, ఐదో రోజు ఉగ్రకుట్ర వివరాలు వెల్లడించినట్టు తెలిసింది. బాంబుపేలుళ్ల కుట్రకేసులో ప్రధాన సూత్రధారి సిరాజ్‌గా విచారణలో నిర్ధారణకు వచ్చిన ఎన్‌ఐఏ అధికారులు కీలక ఆధారాలు రాబట్టే పనిలో పడ్డారు. అహీంగ్రూప్‌లో ఉన్న 20 మంది సభ్యుల వివరాలపై ఆరా తీస్తున్నారు. ఆ గ్రూపు సభ్యులతోనే ఏడు చోట్ల పేలుళ్లకు ప్లాన్ చేసినట్టు ఎన్‌ఐఏ విచారణలో తేలినట్టు తెలుస్తోంది. ప్రశాంతతకు మారుపేరుగా ఉన్న విజయనగరం జిల్లాను ధ్వంసం చేసేందుకు సిరాజ్ పథకం వేసినట్టు పోలీసుల విచారణలో వెల్లడైంది.

ఒక విద్యార్థి.. ఏడుగురు సిబ్బంది



పరీక్ష కేంద్రం వద్ద విధుల్లో ఏఎస్‌ఐ స్వామి

బొబ్బిలి: స్థానిక పాట్టి శ్రీరాములు మున్సిపల్ ఉన్నత పాఠశాలను పదో తరగతి సప్లిమెంటరీ పరీక్ష కేంద్రంగా కేటాయించారు. మంగళవారం జరిగిన సంస్కృతం పరీక్షకు ఒకే విద్యార్థిని హాజరుకాగా... చీఫ్ సూపరింటెండెంట్, డిపార్ట్‌మెంటల్ అధికారి, ఇన్విజిలేటర్, క్లర్క్, ఓ ఏఎన్‌ఎం, ఆశ వర్కర్, ఆయాలతో పాటు ఒక ఏఎస్‌ఐ విధులు నిర్వహించారు. ఒక్కరైనా.. వంద మంది పరీక్ష రాసినా నిబంధనల ప్రకారం సిబ్బంది విధులు నిర్వహించాల్సిందేనని హెచ్‌ఎం జగదీష్ కుమార్ తెలిపారు.

పేర్లు నమోదు చేయండి: జేసీ

విజయనగరం అర్బన్: జిల్లాలో అంతర్జాతీయ యోగా దినోత్సవంలో పాల్గొనేందుకు ఆసక్తి ఉన్నవారి పేర్లు యోగాంధ్ర పోర్టల్‌లో నమోదు చేయాలని జాయింట్ కలెక్టర్ సేతు మాధవన్ ఆదేశించారు. జిల్లా అధికారులు, ఎంపీడీఓలు, ప్రత్యేక అధికారులతో మంగళవారం నిర్వహించిన టెలికాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. జిల్లాలో 7.8 లక్షల మందిని యోగాంధ్రలో భాగస్వాములుగా చేయాలని లక్ష్యంగా నిర్ణయించామని, ప్రతిరోజూ కనీసం 50 వేల మందిని నమోదు చేయాలని సూచించారు. ఇప్పటి వరకు 85 మంది పేర్లు నమోదు చేసుకున్నారన్నారు. జిల్లాలో 5,270 మంది ట్రైనర్లుగా నమోదు చేసుకున్నారన్నారు. వీరికి నేటి నుంచి 31వ తేదీ వరకు ఆయా మండలాల్లో మాస్టర్ ట్రైనర్లు శిక్షణ ఇస్తారని తెలిపారు.

29న నాన్ టీచింగ్ పోస్టులకు ఇంటర్వ్యూలు

విజయనగరం అర్బన్: జిల్లాలో కేజీబీవీ, మోడల్ స్కూళ్లలో ఖాళీగా ఉన్న చౌకీదార్ కుక్, డే వాచ్ ఉమెన్/నైట్ వాచ్ ఉమెన్, స్కావెంజర్, స్వీపర్ వంటి నాన్ టీచింగ్ పోస్టుల భర్తీ కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు ఈ నెల 29న స్థానిక కంటోన్మెంట్ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో జరిగే ఇంటర్వ్యూకు హాజరుకావాలని సమగ్ర శిక్ష ఏపీసీ డాక్టర్ ఎ.రామారావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హత కలిగిన అభ్యర్థులు ఆ రోజు ఉదయం 9 గంటలకు విద్యార్హత ఒరిజినల్, జెరాక్స్ కాపీలతో హాజరు కావాలని తెలిపారు. అర్హుల జాబితాను 'విజయనగరం.ఏపీ.జీఓవి.ఐఎన్' వెబ్‌సైట్‌లో పొందుపరిచామన్నారు.

కూటమి ప్రభుత్వంలో దళితులపై పెరిగిన దాడులు

- దళిత బహుజన శ్రామిక యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి జయశంకర్



శృంగవరపుకోట: కూటమి ప్రభుత్వ పాలనలో దళిత, మైనార్టీ యువకులపై దాడులు ఎక్కువయ్యాయని దళిత బహుజన శ్రామిక యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.జయశంకర్ ఆందోళన వ్యక్తంచేశారు. రాజ్యాంగాన్ని పరిరక్షించాల్సిన పోలీసులే నడి రోడ్డుపై తెనాలిలో ముగ్గురు దళిత యువకులను విచక్షణ రహితంగా కొట్టడం తగదని, పోలీసులపై ఎస్సీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఎస్.కోట పట్టణంలో మంగళవారం స్థానిక విలేకరులతో మాట్లాడారు. ఏవరైనా తప్పు చేస్తే కోర్టులో హాజరుపర్చి తగిన శిక్షపడేలా చేయాలే తప్ప, చట్టాన్ని చేతుల్లోకి తీసుకొని తామే న్యాయమూర్తులమని భ్రమించి శిక్షించడం సమంజసం కాదన్నారు. తెనాలి ఘటనపై సమగ్రంగా విచారణ చేసి బాధ్యులైన సీఐలు రాములునాయక్, రమేష్‌బాబు, కానిస్టేబుల్ చిరంజీవిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేదంటే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు.



విజయనగరం జిల్లాలోని అగ్రిగోల్డ్ బాధితుల సంఖ్య **1,08,470**

చేసిన డిపాజిట్ల మొత్తం విలువ **రూ.765కోట్లు (సుమారుగా)**

చనిపోయిన అగ్రిగోల్డ్ బాధితుల సంఖ్య **16**

రూ.5 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియో అందినది.. **ఇద్దరికి**

కమిటీలతో కాలయాపన

- అగ్రిగోల్డు బాధితులను ఆదుకోని కూటమి సర్కారు
- అధికారంలోకి వచ్చి ఏడాది గడిచినా రూపాయి ఇవ్వని వైనం
- బాధితుల గోడును పట్టించుకోని పాలకులు
- గత జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం రూ.929.75 కోట్ల చెల్లింపు
- జిల్లాలో 70వేల మంది బాధితులకు లబ్ధి

విజయనగరం గంటస్తంభం:

అధికారంలోకి వచ్చిన వెంటనే అగ్రిగోల్డ్ బాధితులను ఆదుకుంటామంటూ ఎన్నికల ముందు కూటమి నేతలు హామీ ఇచ్చారు. ఊరూరా గొప్పగా ప్రచారం చూశారు. ఓట్లు దండుకున్నారు. తీరా అధికారం చేపట్టి ఏడాది గడిచినా అగ్రిగోల్డ్ బాధితుల సమస్యను పట్టించుకోవడంలేదు. వారి గోడు వినిపించుకోవడం లేదు. 2014–19 మధ్యకాలంలో ఇలాగే మోసపోయామని, మళ్లీ మరోసారి సీఎం చంద్రబాబునాయుడు తమను మోసం చేశారంటూ బాధితులు గగ్గోలు పెడుతున్నారు.

ఆదుకున్న గత ప్రభుత్వం

2014 నుంచి ఐదేళ్లపాటు అగ్రిగోల్డ్ బాధితులు న్యాయం చేయాలంటూ పోరాటం సాగించారు. అయినా ఫలితం కనిపించలేదు. దాచుకున్న డబ్బులు రావనే బెంగతో జిల్లాలో 16 మంది చనిపోయారు. దీనిపై అప్పటి టీడీపీ ప్రభుత్వం కనీసం పట్టించుకోలేదు. రూపాయి డబ్బులు చెల్లించే ఏర్పాటుచేయలేదు. 2019 ఎన్నికల సమయంలో అగ్రిగోల్డ్ వివాదం ప్రధానాంశంగా మారింది. అధికారంలోకి వస్తే అగ్రిగోల్డ్ బాధితులకు దశలవారీగా డిపాజిట్లు తిరిగి చెల్లిస్తామని వైఎస్సార్‌సీపీ అధినేత జగన్‌మోహన్ రెడ్డి హామీ ఇచ్చారు. ఆ మేరకు రెండు దశల్లో రూ.929.75 కోట్లు చెల్లించారు. మొత్తం 10.37లక్షల మంది అగ్రిగోల్డ్ బాధితులకు ఆ డబ్బు అందగా, జిల్లాలో 20వేల లోపు డిపాజిట్ చేసిన 70 వేల మందికి రూ.36,97,96,900లు లబ్ధి చేకూరింది. జిల్లా వ్యాప్తంగా 1,08,470 మంది అగ్రిగోల్డ్ బాధితులు ఉన్నారు. వీరు సుమారుగా రూ.765 కోట్లు డిపాజిట్ చేశారు.

న్యాయంచేసేది ఎప్పుడు?

అధికారంలోకి వస్తే అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం చేస్తామని చెప్పిన కూటమి ప్రభుత్వం ఇప్పుడు దాని ఊసే లేదు. అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం చేసే దిశగా ప్రభుత్వం ఏ ఒక్క చర్య కూడా ప్రారంభించలేదు. కమిటీలు ఏర్పాటు చేయడం వల్ల కాలయాపన తప్ప..11 నెలలుగా ఒక్క సమస్య కూడా పరిష్కారం కాలేదు. ఇప్పుడైనా కమిటీల పేరుతో కాలయాపన చేయకుండా అగ్రిగోల్డ్ బాధితుల కుటుంబాలకు న్యాయం చేకూరే చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

రోడ్డున పడుతున్నాం

నాతో పాటు భార్య పేరున అగ్రిగోల్డ్‌లో రూ.2 లక్షలు డిపాజిట్ చేశాను. రూ.10వేల చొప్పున రెండు సార్లు డబ్బులొచ్చాయి. రూ.20వేల డిపాజిట్ల చెల్లింపు సమయంలో నా ఖాతాలోకి నగదు రాలేదు. ఒకటికి మించి బాండ్లు కలిగిన వారిలో చాలామంది నష్టపోయారు. కూటమి ప్రభుత్వం స్పందించి డిపాజిట్ డబ్బులు చెల్లించే ఏర్పాట్లు చేయాలి.

– సిదగం గురునాయుడు, విజయనగరం

ఒక బాండుకే డబ్బులు..

రూ.5 లక్షల డిపాజిట్ చేశాను. రూ.10 వేల చొప్పున రెండు సార్లు డబ్బులొచ్చాయి. రూ.50 వేలు, రూ. లక్ష విలువైన బాండ్లకు నేటికీ డబ్బులు ఇవ్వలేదు. కుటుంబాలతో రోడ్డున పడుతున్నాం. ఇచ్చిన మాట ప్రకారం కూటమి ప్రభుత్వం ఆదుకోవాలి.

– జి.ఆదినారాయణ, విజయనగరం జిల్లా

ఆదుకోండి 'బాబూ'..



మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు అధికారంలోకి వచ్చిన తొలికేబినెట్ సమావేశంలో అగ్రిగోల్డ్ బాధితులకు రూ.929.75 కోట్లు కేటాయించారు. బాధితులకు కొంతమేర న్యాయం చేశారు. ఇంకొంత మొత్తం రావాల్సి ఉంది. ఇప్పుడున్న కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదికావస్తున్నా అగ్రిగోల్డ్ బాధితులు గురించి ఎటువంటి చర్య తీసుకోకపోవడం విచారకరం.

– మజ్జి సూరప్పుడు, అగ్రిగోల్డ్ బాసట కమిటీ అధ్యక్షుడు, విజయనగరం పార్లమెంట్ నియోజకవర్గం

ఉగ్రవాదుల అన్వేషణలో కూటమి విఫలం



కలెక్టరేట్లో మాట్లాడుతున్న హిందూ ధర్మ రక్షా సమితి ప్రతినిధులు శ్రీనివాస్, వేణుగోపాలరావు

- హిందూ ధర్మ రక్షా సమితి

విజయనగరం అర్బన్: ఉగ్రవాదులను కనిపెట్టడం, వారి కార్యకలాపాలకు అడ్డుకట్టవేయడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని హిందూ ధర్మ రక్షా సమితి ప్రతినిధులు శ్రీనివాస్, నందివాడ వేణుగోపాలరావు విమర్శించారు. ప్రజలకు భద్రత కల్పించాలని కోరుతూ విజయనగరం పట్టణంలోని సిరాజ్ కుటుంబం నివసిస్తున్న ఆబాద్‌వీధి, అంబటి సత్రం, అశోక్ నగర్ ప్రాంతాలవారితో కలిసి కలెక్టర్ అంబేడ్కర్‌కు కలెక్టరేట్‌లో మంగళవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొంతకాలంగా అంబటి సత్రం, ఆబాద్ వీధిలో మసీదులు, మదర్సాలు పెరిగిపోతున్నాయని, స్థానికులు కాకుండా గుర్తుతెలియన వ్యక్తులు ఇక్కడ నివసిస్తున్నారని ఆరోపించారు. ఉగ్రభావజాలంతో అరెస్టు అయిన సిరాజ్‌తో పాటు ఆయన తండ్రి, అన్నయ్యను కూడా కస్టడీలోకి తీసుకుని విచారణ జరపాలని డిమాండ్ చేశారు. విజయనగరం పట్టణానికి ఉగ్రముప్పు తప్పించాలని కోరారు.

సర్వజన ఆస్పత్రిలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్

- నిలిచిన విద్యుత్ సరఫరా



షార్ట్‌సర్క్యూట్‌తో కాలిపోయిన విద్యుత్ వైర్లు



చీకటిలో నిరీక్షిస్తున్న రోగులు

విజయనగరం ఫోర్ట్: ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలోని కంటి విభాగం వద్ద మంగళవారం విద్యుత్ షార్ట్ సర్క్యూట్ జరిగింది. మంటలు చెలరేగడంతో వైర్లు కాలిపోయాయి. రోగులు భయాందోళన చెందారు. గతంలోనూ ఈ విధంగానే ఆస్పత్రిలో షార్ట్ సర్క్యూట్ జరిగిందని, అప్పుడు కూడా వైర్లు కాలి బూడిదైనట్టు వైద్యసిబ్బంది తెలిపారు. విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో రోగులు, వైద్యులు, సిబ్బంది ఇబ్బంది పడ్డారు. వైద్యసేవలకు అంతరాయం కలిగింది.

కోవిడ్ రోగుల కోసం ప్రత్యేక వార్డు



కోవిడ్ రోగుల వార్డులో మాక్ డ్రిల్‌ను పరిశీలిస్తున్న సూపరింటెండెంట్ అప్పలనాయుడు, పలమనాలజిస్టు సంతోష్‌కుమార్, తదితరులు

సాక్షి ఎఫెక్ట్...

విజయనగరం ఫోర్ట్: కోవిడ్ కేసులు నమోదవుతున్న నేపథ్యంలో జిల్లాలో కోవిడ్ ఎదుర్కొనే సన్నద్ధత చర్యలు చేపట్టలేదనే అంశంపై 'కోవిడ్‌పై సన్నద్ధత శూన్యం..!' అనే శీర్షికన 'సాక్షి'లో మంగళవారం ప్రచురించిన కథనానికి ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి వైద్యాధికారులు స్పందించారు. ఆస్పత్రిలో కోవిడ్ రోగుల కోసం ప్రత్యేక వార్డును ఏర్పాటు చేసినట్టు ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సంబంగి అప్పలనాయుడు తెలిపారు. వైద్యపరీక్షల నిర్వహణకు ప్రత్యేక టీమ్‌ను ఏర్పాటుచేయడంతో పాటు మాక్ డ్రిల్ నిర్వహించారు.

బది'లీలలు'..!

- తప్పుడు ధ్రువీకరణ పత్రాల సమర్పణ
- ఓ ఉపాధ్యాయురాలి ఫిర్యాదుతో వెలుగులోకి..
- సర్వజన ఆస్పత్రి నుంచి 321 మందికి దివ్యాంగ ధ్రువపత్రాల జారీ



ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి

విజయనగరం ఫోర్ట్: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఉపాధ్యాయ బదిలీల తీరు గందరగోళంగా ఉందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. కొందరు ఉపాధ్యాయులు బదిలీల నుంచి మినహాయింపు పొందేందుకు తప్పుడు దివ్యాంగత్వ పత్రాలను సమర్పిస్తున్నారన్న ఫిర్యాదులు వస్తున్నాయి. బదిలీ కాకుండా ఉండేందుకు బొబ్బిలి ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో తెలుగు పండిట్‌గా పనిచేస్తున్న బి.వెంకటరత్నం కుడి చేతివేలి లేని కారణంగా 50 శాతం వైకల్యం ఉన్నట్టు ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో పొందిన తప్పుడు ధ్రువీకరణ పత్రాన్ని విద్యాశాఖకు సమర్పించినట్టు పార్వతీపురం ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలకు చెందిన రిట్టపల్లి ప్రమీల రాణి కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్‌సెల్‌లో ఫిర్యాదుచేశారు. ఈ సంఘటనతో బదిలీల కోసం ఉపాధ్యాయులు సమర్పించిన ధ్రువపత్రాలపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. బదిలీలు నిలుపుదల చేసుకునేందుకు కొందరు ఉపాధ్యాయులు అడ్డదారిలో మెడికల్ సర్టిఫికెట్స్ సంపాదించారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అధికార పార్టీ ప్రజాప్రతినిధులతో వైద్యులపై ఒత్తిడి తెచ్చి ధ్రువపత్రాలు పొందినట్టు సమాచారం.

వైకల్యం సర్టిఫికెట్ ఉంటే బదిలీ నుంచి మినహాయింపు...

ఉపాధ్యాయలకు ఏదైనా వైకల్యం ఉన్నట్టయితే వారికి బదిలీ నుంచి మినహాయింపు ఉంటుంది. వారు ప్రస్తుతం పనిచేసే చోటే ఉండిపోవచ్చు. వేరే చోటకు బదిలీ కావడం ఇష్టం లేని ఉపాధ్యాయులు వైకల్య ధ్రువీకరణ పత్రం పొందేందుకు శతవిధాలా ప్రయత్నిస్తున్నట్టు తెలుస్తోంది. జిల్లా వ్యాప్తంగా 321 మంది ఉపాధ్యాయులకు ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలోని మెడికల్ బోర్డు దివ్యాంగత్వ సర్టిఫికెట్స్‌ను జారీ చేసింది. ఈఎన్‌టీ, మానసిక, ఎముకలు, కంటి విభాగాల్లో ఇచ్చిన ధ్రువపత్రాల వాస్తవికతపై ప్రస్తుతం చర్చ సాగుతోంది.

విచారణ చేపట్టాం

బొబ్బిలి ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలకు చెందిన ఉపాధ్యాయురాలు తీసుకున్న దివ్యాంగత్వ ధ్రువీకరణ పత్రంపై ఫిర్యాదు అందింది. విచారణ జరిపి చర్యలు తీసుకుంటాం. అన్నీ పరిశీలించిన మీదటే ధ్రువపత్రాలు అందజేయడం జరుగుతుంది. – డాక్టర్ ఎస్.అప్పలనాయుడు, సూపరింటెండెంట్, ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి

దర్జాగా ప్రభుత్వ భూముల కబ్జా



ఆక్రమణలో శ్మశాన వాటిక స్థలం

- ప్రభుత్వ భూములకు అక్రమ విద్యుత్ కనెక్షన్లు
- బోర్లు తవ్వి వాల్టా చట్టానికి తూట్లు
- హెచ్చరిక బోర్డులు సైతం తీసేసి సాగుకు ఉపక్రమించిన అక్రమార్కులు
- గుషిణిలో కూటమి సానుభూతిపరుల కబ్జాల పర్వం
- చర్యలకు గ్రామస్తుల డిమాండ్



గుషిణి రెవెన్యూ పరిధిలో ఆక్రమణలో ఉన్న సింహాద్రి చెరువు

నెల్లిమర్ల రూరల్:

మండలంలో గుషిణి గ్రామంలో కోట్లాది రూపాయలు విలువచేసే ప్రభుత్వ భూములు కబ్జాకు గురవుతున్నాయి. అధికార పార్టీ నాయకుల అండదండలతో సాగుభూములుగా మారుతున్నాయి. ఆక్రమణలు యథేచ్ఛగా సాగుతున్నా రెవెన్యూ అధికారులు చోద్యం చూస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. గ్రామానికి చెందిన కొంత మంది కూటమి పార్టీ సానుభూతిపరులు ప్రభుత్వ భూములను ఆక్రమించుకొని దర్జాగా సాగుచేసుకుంటున్నా అధికారులు కిమ్మనకపోవడం అనుమానాలకు తావిస్తోంది. కబ్జాల బాగోతంపై పలుమార్లు ఆధారాలతో ఫిర్యాదుచేస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామానికి చెందిన కనిగిరి శ్రీనివాసరావు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ భూములు ఆక్రమించడమే కాకుండా ఆ స్థలాల్లో బోర్లు కూడా ఏర్పాటు చేసి వాల్టా చట్టానికి కూడా తూట్లు పొడిచారని చెబుతున్నారు.

ప్రభుత్వ భూములకు విద్యుత్ కనెక్షన్లు ఎలా?

గుషిణి రెవెన్యూ పరిధిలోని 79/2లో శ్మశాన వాటిక, సర్వే నంబర్ 80/1లో సింహాద్రి చెరువు,



ప్రభుత్వ భూముల ఆక్రమణలపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదుచేస్తున్న కనిగిరి శ్రీను, తదితరులు

సర్వే నంబర్ 65/15లో ప్రభుత్వ భూములను అదే గ్రామానికి చెందిన చందక రమణ, సూర్యారావు, సూరప్పలనాయుడు, తదితరులు ఆక్రమించుకున్నట్టు శ్రీనివాసరావు ఇటీవల రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. ప్రభుత్వ భూములను ఆక్రమించుకోవడం కాకుండా నిబంధనలకు విరుద్ధంగా విద్యుత్ కనెక్షన్లు కూడా పొందారు. ప్రభుత్వ భూముల్లో బోర్లు వేసి దర్జాగా సాగుచేసుకుంటున్నారు. ప్రభుత్వ భూములకు విద్యుత్ కనెక్షన్లను సంబంధిత అధికారులు ఎలా ఇచ్చారనేది ప్రశ్నార్థకంగా మారింది.

హెచ్చరిక బోర్డులను తొలగించి మరీ...

ప్రభుత్వ భూముల ఆక్రమణలపై వచ్చిన ఫిర్యాదుతో తహసీల్దార్ సుదర్శనరావు రెవెన్యూ సిబ్బందితో ఆరునెలల కిందట సర్వే చేయించారు. సర్వే నంబర్ 65/15లో చందక సూరప్పనాయుడు, చందక సత్యం అనే వ్యక్తులు సాగు చేస్తున్న సుమారు 0.72 సెంట్లలో విస్తీర్ణంలో బంజరు భూమి ఆక్రమణకు గురైనట్లు, అక్రమంగా బోరును కూడా తవ్వినట్లు గుర్తించారు. సర్వే నంబర్ 65/30 లో మరో బోరు ఉన్నట్లు గుర్తించారు. సర్వే నంబర్ 79/2లో గెడ్డ పోరంబోకు భూమిలో ఉన్న శ్మశాన వాటికలో చందక రమణ, చందక సూర్యారావు వ్యక్తుల పేరిట సుమారు 0.10 సెంట్ల భూమి ఆక్రమణకు గురైనట్లు స్వయంగా రెవెన్యూ అధికారులే నిర్ధారించి ప్రకటించారు. ఆక్రమిత స్థలాల్లో హెచ్చరిక బోర్డులు కూడా ఏర్పాటు చేశారు. అధికారులు ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డులను సైతం సదరు ఆక్రమణదారులు తొలగించడం గమనార్హం.

చర్యలు తీసుకుంటాం...

గుషిణిలో ప్రభుత్వ భూముల ఆక్రమణపై తహసీల్దార్ సుదర్శనరావు ఆధ్వర్యంలో గతంలో సర్వే చేయించారు. ఆక్రమణలు, అక్రమంగా బోర్ల ఏర్పాటు, విద్యుత్ కనెక్షన్లు మంజూరు వంటివి గుర్తించారు. ఆక్రమిత స్థలాల్లో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశాం. ఆ బోర్డులను తొలగించినట్లు మా దృష్టికి వచ్చింది. మరోసారి పరిశీలించి చర్యలు తీసుకుంటాం.

– రవి శంకర్, ఇన్‌చార్జి తహసీల్దార్, నెల్లిమర్ల

ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకోవాలి



గుషిణిలో కూటమి పార్టీ సానుభూతిపరులు కోట్లాది రూపాయలు విలువ చేసే ప్రభుత్వ భూములను ఆక్రమించుకున్నారు. శ్మశానవాటిక భూమిని కూడా వదల్లేదు. ఆక్రమిత స్థలాల్లో అక్రమంగా విద్యుత్ కనెక్షన్లు పొంది బోర్లు కూడా ఏర్పాటు చేసుకొని దర్జాగా అనుభవిస్తున్నారు. ఆక్రమణలు అని రెవెన్యూ అధికారులు ధ్రువీకరించి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేస్తే వాటిని కూడా తొలగించారు. అసలు ప్రభుత్వ భూములకు విద్యుత్ కనెక్షన్లు ఎలా ఇచ్చారనే విషయంపై విద్యుత్ అధికారులు సమాధానం ఇవ్వాలి. సమగ్ర విచారణ జరిపి ప్రభుత్వ భూములను పూర్తి స్థాయిలో స్వాధీనం చేసుకోవాలి.

– కనిగిరి శ్రీను, జై భీమ్‌రావ్ భారత్ పార్టీ జిల్లా కార్యదర్శి

క్లుప్తంగా

పైడితల్లికి మామిడి పండ్ల నివేదన



మామిడి పండ్ల నివేదన, పుష్పాలంకరణలో పైడితల్లి అమ్మవారు

విజయనగరం టౌన్: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం, కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి శ్రీ పైడి తల్లి అమ్మవారికి మంగళవారం మామిడిపండ్లతో నివేదన చేశారు. అమ్మవారు పుష్పాలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ప్రధాన అర్చకుడు ఏడిద రమణ ఆధ్వర్యంలో అమ్మవారికి వేకువజామునుంచి పంచామృతాలతో అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. ఆలయ సిరిమాను పూజారి బంటుపల్లి వెంకటరావు, తాళ్లపూడి ధనుంజయ్, నేతేటి ప్రశాంత్ లు శాస్త్రోక్తంగా నిత్య పూజలు చేశారు. మహిళలు అమ్మవారిని దర్శించి పసుపు, కుంకుమలు సమర్పించి మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఆలయం వెనుక ఉన్న వేప,రావిచెట్ల వద్ద దీపారాధన చేశారు. ఆలయ ఇన్చార్జ్ ఈఓ కేఎన్‌వీడీవీ ప్రసాద్ కార్యక్రమాలను పర్యవేక్షించారు.

లారీ ఇంజిన్‌లో మంటలు



లారీ ఇంజిన్‌లో నుంచి వ్యాపించిన మంటలతో కూడుకున్న పొగ

పార్వతీపురం రూరల్: విశాఖ నుంచి ఒడిశాలోని రాయగడ ప్రాంతానికి బొగ్గు లోడుతో వెళ్తున్న లారీ ఇంజిన్‌లో షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు వ్యాపించాయి. జిల్లా కేంద్రంలోని వైఎస్సార్ ట్రాఫిక్ కూడలి వద్ద మంగళవారం ఉదయం 7గంటలకు జరిగిన ఈ సంఘటనను గుర్తించిన డ్రైవర్ అప్రమత్తమై లారీని నిలిపివేసి స్థానికుల సహాయంతో అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించాడు. దీంతో హుటాహుటిన ఫైర్ సిబ్బంది చేరుకుని మంటలను ఆర్పివేశారు. ఒక్కసారిగా లారీ ఇంజిన్‌లో నుంచి పెద్ద ఎత్తున దట్టమైన పొగ వ్యాపించడంతో స్థానికులు, వాహనచోదకులు భయభ్రాంతులకు గురయ్యారు.

తల్లి మందలించిందని తనయుడి ఆత్మహత్య



సురేష్ మృతదేహం

రాజాం సిటీ: మద్యం తాగవద్దని తల్లి మందలించిందని మనస్తాపం చెందిన తనయుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన మండల పరిధిలోని బొమ్మినాయుడువలసలో మంగళవారం జరిగింది. ఈ ఘటనకు సంబంధించి ఏఎస్సై కేవీ రమణమూర్తి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. బొమ్మినాయుడువలస గ్రామానికి చెందిన నరం సురేష్ (33)ను మద్యం తాగవద్దని తల్లి నరసమ్మ మందలించింది. ఆమె మందలించడాన్ని జీర్ణించుకోలేక ఈ నెల 22న మద్యం మత్తులో గడ్డిమందు తాగేశాడు. అపస్మారక స్థితిలో ఉన్న సురేష్‌ను స్థానికులు శ్రీకాకుళం ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడని ఏఎస్సై తెలిపారు. ఈ ఘటనపై మృతుడి తమ్ముడు శివప్రసాద్ ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని ఏఎస్సై తెలిపారు.

చికెన్

బ్రాయిలర్

లైవ్	డెస్డ్	స్కిన్‌లెస్
₹125	₹220	₹230



బెట్టింగ్ మాయలో పడి..!

- తప్పుదారి పడుతున్న యువత
- బెట్టింగ్ మనీ కోసం అప్పులు, దొంగతనాలు
- ఆర్థికంగా దివాలా తీస్తున్న కుటుంబాలు



ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌లో పందెం కాస్తున్న ఓ యువకుడు

వీరఘట్టం: ఈ సీజన్ ఐపీఎల్ బెట్టింగ్‌లో ఘోరంగా డబ్బులు పోగొట్టుకున్న వీరఘట్టానికి చెందిన ఓ కుర్రాడు తాను పనిచేస్తున్న ఇంట్లో సుమారు 5 తులాల బంగారు నగలు దొంగిలించాడు. అలాగే ఇంకొందరు యువకులు అధిక వడ్డీలకు అప్పులు కూడా చేస్తున్న సంఘటనలు వెలుగుచూస్తున్నాయి. ఇటువంటి ఉదంతాలు ఎన్నో కుటుంబాల్లో కలకలం రేపుతున్నాయి. బెట్టింగ్ ఉచ్చులో పడి ఎన్నో కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి. ఇంకా మేల్కోకపోతే యువత భవిత సర్వనాశనం అవడం ఖాయమని మేధావులు అంటున్నారు. ప్రతి ఏటా జూద క్రీడలకు అలవాటుపడిన కొందరు అలవాటు మానుకోలేక సీజనల్ జూదానికి తెరలేపుతున్నారు. ఏడాదిలో 20 శాతం పేకాట, మిగిలిన 80 శాతం క్రికెట్ బెట్టింగ్‌లతో కాలం వెళ్లబుచ్చుతున్నట్లు నివేదికలు చెబుతున్నాయి. యువతను బెట్టింగ్ రొంపిలోకి లాగుతున్నారు. తాజాగా రెండు నెలల క్రితం ప్రారంభమైన ఐపీఎల్ క్రికెట్ పోటీలను తిలకిస్తూ బెట్టింగ్‌లు కాస్తున్నారు. ఈ ఏడాది జరుగుతున్న ఐపీఎల్ టోర్నమెంట్ మరికొద్ది రోజుల్లో ముగియనుంది. ఈ మ్యాచ్‌ల కోసం పార్వతీపురం మన్యం జిల్లాలో రూ.కోట్లలో బెట్టింగ్ జరుగుతున్నట్లు తెలుస్తోంది.

అంతా ఆన్‌లైన్‌లోనే..

ప్రస్తుతం క్రికెట్ బెట్టింగ్ అంతా ఆన్‌లైన్‌లోనే దర్జాగా జరుగుతోంది. మీడియేటర్ల ద్వారా పందాలు కాస్తున్నారు. ప్రతి రోజూ వీరఘట్టంలో రూ.50 లక్షల వరకూ బెట్టింగ్‌లు విచ్చలవిడిగా బహిరంగ ప్రాంతాల్లో జరుగుతున్నట్లు సమాచారం. వీరఘట్టంలోని అంబేడ్కర్ జంక్షన్‌లో ఉదయం 7 గంటల నుంచి 9గంటల వరకూ ఇవే చర్చలు. లక్నో టీమ్ నాదంటే, రాజస్థాన్ రాయల్స్ నాది అంటూ వెయ్యి రూపాయలకు రూ.16 వందలకు పందాలు కాస్తూ బెట్టింగ్ బంగార్రాజులు పేట్రేగి పోతున్నారు.చిన్న చిన్న కిరాణాషాపులు, పకోడీబడ్డీలు, పాన్‌షాపుల వద్ద ఈ తతంగం అంతా జరుగుతోంది. టెస్ట్‌మ్యాచ్‌లు, టీ20, వన్‌డే మ్యాచ్‌లు అని తేడా లేకుండా క్రికెట్ ఏ తరహాదైనా బెట్టింగ్ మాత్రం అదే తరహాలో కాస్తున్నారు. ఈ బెట్టింగ్‌లకు అలవాటుపడిన యువత పక్కదోవ బడుతున్నారు. అధిక వడ్డీలకు అప్పులు చేసి కుదేలవుతున్నారు. మరికొంత మంది ఆర్థిక నేరాలకు, దొంగతనాలకు పాల్పడుతున్నారు. మాయదారి క్రికెట్ బెట్టింగ్‌లు వీరఘట్టంలో గడిచిన పదిహేనేళ్ల నుంచి యథేచ్ఛగా జరుగుతున్నా ఇంతవరకూ ఒక్క కేసు కూడా నమోదు కాలేదు.

పోలీసులేమంటున్నారంటే..

ఇదే విషయాన్ని ఎస్సై జి.కళాధర్ వద్ద సాక్షి ప్రస్తావించగా క్రికెట్ బెట్టింగ్‌లపై నిఘా వేసి బెట్టింగ్‌లకు పాల్పడిన వారిపై కేసులు నమోదు చేస్తామన్నారు. యువత ఎక్కువగా క్రికెట్ బెట్టింగ్ వేస్తున్నట్లు తెలుస్తోంది. తల్లిదండ్రులు కూడా వారి పిల్లల నడవడికపై దృష్టి సారించి వారిని మంచి మార్గంలో నడిపించేలా చొరవ చూపాలి.

అనర్హులకు కేటాయించిన ఇళ్ల రద్దు

- 11 వేల గృహప్రవేశాలకు సిద్ధం చేయండి
- కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్



మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ బీఆర్‌అంబేడ్కర్

విజయనగరం అర్బన్: పేదలకు గృహనిర్మాణం కోసం ప్రభుత్వం అదనపు నగదు మంజూరు చేసిందని అయినప్పటికీ గృహ నిర్మాణాల కోసం ముందుకురాని లబ్ధిదారుల స్టేటస్‌ను వెరిఫై చేయాలని కలెక్టర్ డాక్టర్ బీఆర్‌అంబేడ్కర్ ఆదేశించారు. లబ్ధిదారులకు సొంత గృహం ఉండడం వల్లనే గృహ నిర్మాణాలకు ముందుకు రావడం లేదని తెలుస్తోందని అటువంటి వారి జాబితాలను ఇంటింటికీ వెళ్ల వెరిఫై చేసి ఆధారాలతో సహా రెండు రోజుల్లో ఇవ్వాలని వారికి మంజూరైన గృహాలను రద్దు చేయనున్నట్లు కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రధాన మంత్రి అవాజ్ యోజన కింద మంజూరైన 11 వేల గృహాలను గృహప్రవేశాలకు సిద్ధం చేయాలని ఆదేశించారు. 11 వేల ఇళ్లకు గాను ఇప్పటి వరకు 41 శాతం మాత్రమే పూర్తయ్యాయని ఇంకనూ 6,924 గృహాలు పూర్తి కావలసి ఉందన్నారు. బొబ్బిలి, విజయనగరం అర్బన్‌లో తక్కువ గృహాలు పూర్తి కావడంపై వివరణ అడిగారు. నీటి సరఫరా లేదని, వేసిన బోర్లు దొంగతనానికి గురయ్యాయని మున్సిపల్ కమిషనర్లకు లేఖ రాశామని పీడీ మురళి తెలిపారు. రెండు రోజుల్లో బోర్లన్నీ పనిచేసేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ఇళ్ల స్థలాల కోసం గతంలో ఇచ్చిన 4,096 దరఖాస్తులను వెరిఫై చేయాలని అలాగే మాన్యువల్‌గా వచ్చిన మరో 2,500 దరఖాస్తులను కొందరు తహసీల్దార్లతో సమన్వయం చేసుకుని అర్హతను వెరిఫై చేయాలని స్పష్టం చేశారు. అందరికీ గృహాలు, పీఎంజన్ మన్‌పథకాల కింద మంజూరైన జాబితాలను కూడా వెరిఫై చేయాలని సూచించారు. సమావేశంలో హౌసింగ్ పీడీ మురళీ మోహన్, ఈఈలు, డీఈలు, ఏఈలు పాల్గొన్నారు.

కానిస్టేబుల్ మృతికి సంతాపం



లోకేష్(ఫైల్)

జి.సిగడాం: స్థానిక పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పని చేస్తున్న వల్లంశెట్టి లోకేష్(38) అనారోగ్యంతో మంగళవారం మృతి చెందారు. ఇతని స్వగ్రామం విజయనగరం జిల్లా జామి మండలం అట్టాడ. కొద్దికాలంగా అనారోగ్యంతో బాధపడుతూ విశాఖలోని ఓ ప్రయివేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. పరిస్థితి విషమించడంతో మంగళవారం మృతిచెందారు. లోకేష్‌కు భార్య అచ్చియ్యమ్మ, కుమారుడు దివిన్, కుమార్తె భవిశ్రీ ఉన్నారు. లోకేష్ మృతి పట్ల రణస్థలం సీఐ అవతారం, ఎస్ఐ వై.మధుసూదనరావు, ఏఎస్ఐలు పొగిరి శంకరరావు, కోరుకొండ రామకృష్ణ, సిబ్బంది సంతాపం తెలిపారు.

వెబ్‌సైట్‌లో ల్యాబ్‌టెక్నీషియన్ పోస్టుల జాబితా

విజయనగరం ఫోర్ట్: ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి, ప్రభుత్వ వైద్య కళాశాలలో పోస్టుల భర్తీకి సంబంధించి ఐదుకేటగిరీలకు చెందిన ప్రొవిజినల్ మెరిట్ జాబితాను విజయనగరం.ఏపీ.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్‌లో పొందుపరిచినట్లు ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.పద్మలీల మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జూనియర్ అసిస్టెంట్ కమ్ కంప్యూటర్ అసిస్టెంట్, సిస్టమ్ అడ్మినిస్ట్రేటర్, పీఈటీ, ల్యాబ్ టెక్నీషియన్, ఎలక్ట్రీషియన్ గ్రేడ్-3 పోస్టులకు సంబంధించిన ప్రొవిజినల్ మెరిట్ జాబితాను వెబ్‌సైట్‌లో పెట్టారు. దీనిపై ఏవైనా అభ్యంతరాలు ఉంటే 28 నుంచి 31 వతేదీ వరకు, 2 వతేదీ నుంచి నాలుగో తేదీ వరకు ఉదయం 10:30 గంటల నుంచి మధ్యాహ్నం 1:30 గంటల వరకు, మధ్యాహ్నం 2:30 గంటల నుంచి సాయంత్రం 5 గంటలులోగా తెలియజేయాలని సూచించారు.

పైడితల్లమ్మవారికి జెడ్పీ చైర్మన్ ప్రత్యేక పూజలు

- పైడితల్లమ్మకు జెడ్పీ ఛైర్మన్ ప్రత్యేక పూజలు



పైడితల్లమ్మవారికి కుటుంబసమేతంగా పూజలు చేస్తున్న జిల్లా పరిషత్ ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

విజయనగరం: కార్పొరేషన్ పరిధిలోని ధర్మపురి గ్రామంలో వెలసిన పైడితల్లమ్మవారికి విజయనగరం జిల్లా పరిషత్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు కుటుంబసమేతంగా మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి చల్లదనోత్సవంలో భాగంగా సతీమణి ఆయన పుష్పాంజలి, కుమార్తె సిరిసహస్ర, అల్లుడు ప్రదీప్ నాయుడులతో కలిసి అమ్మవారిని దర్శించుకుని పట్టువస్త్రాలు, పసుపు, కుంకుమలు అమ్మవారికి సమర్పించారు. ఈ సందర్భంగా మజ్జి శ్రీనివాసరావు మాట్లాడుతూ చల్లనితల్లి పైడితల్లమ్మవారి ఆశీస్సులు అందరిపై ఉండాలని ఆకాంక్షించారు. ధర్మపురిలో వెలసిన పైడితల్లమ్మవారి ఆలయ అభివృద్ధికి తమ వంతు సహాయ, సహకారాలు అందిస్తానని పేర్కొన్నారు. కార్యక్రమంలో చిన్నశ్రీను సోల్జర్స్ అసోసియేషన్ ప్రతినిధులు పలువురు పాల్గొన్నారు.

పైడిమాంబ చిత్రం రెండో షెడ్యూల్‌కు రెడీ

విజయనగరం టౌన్: శ్రీపైడిమాంబ ఆధ్యాత్మిక కళానికేతన్, జ్ఞానభేరి సంస్థ ఆధ్వర్యంలో నిర్మాణమవుతున్న జై పైడిమాంబ చిత్రం రెండో షెడ్యూల్‌కు సిద్ధమవుతున్నట్లు కళానికేతన్ వ్యవస్థాపకుడు ఆర్.సూర్యపాత్రో పేర్కొన్నారు. ఈ మేరకు స్థానిక లేడీస్ రిక్రియేషన్ క్లబ్ ఆవరణలో మంగళవారం చిత్రయూనిట్, స్థానిక పెద్దలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తొలిషెడ్యూల్‌లో చిత్రం బాగా వచ్చిందన్నారు. ఈ సందర్భంగా అమ్మవారి చిత్రపటాలను, ప్రసాదాలను చిత్ర యూనిట్‌కు అందజేశారు. కార్యక్రమంలో నటులు రవితేజ, డాక్టర్ మురళీధర్, పెద్దింటి అప్పారావు, డాక్టర్ జక్కు రామకృష్ణ, అచ్చిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

యోగాకు రండి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

పార్వతీపురంటౌన్: అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా గ్రామస్థాయిలో కార్యక్రమాలను చేపడుతున్నట్లు కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ తెలిపారు. ఈ మేరకు కలెక్టర్ శ్యామ్ ప్రసాద్, జాయింట్ కలెక్టర్ ఎస్ఎస్ శోభిక మంగళవారం సాయంత్రం జిల్లా, మండల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లాలో పెద్ద ఎత్తున యోగా కార్యక్రమం నిర్వహణలో ప్రజలు భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. ఇప్పటివరకు 216 మాస్టర్ ట్రైనర్‌లకు శిక్షణ జరిగిందని, 3550 శిక్షకులు ఇప్పటి వరకూ నమోదు చేసుకుని శిక్షణ పొందుతున్నారని తెలిపారు. శిక్షకులను గ్రామస్థాయిలో మ్యాపింగ్ చేయాలని సూచించారు. జిల్లాలో 48 వేల మంది ప్రజలు నమోదయ్యారని చెప్పారు. జూన్ 21 నాటికి ప్రతి ఒక్కరూ యోగాపై అవగాహన కలిగి, సాధన చేసే విధంగా ఉండాలని కలెక్టర్ స్పష్టం చేశారు. క్యూ ఆర్ కోడ్ వినియోగించి త్వరితగతిన నమోదు కావచ్చని సూచించారు. జిల్లాలో పెద్ద ఎత్తున నమోదు చేసుకుని ఆదర్శంగా నిలవాలని కోరారు. ప్రతి గ్రామంలో యోగా పోటీలు నిర్వహించాలని ఆదేశించారు. రాష్ట్రస్థాయిలో యోగా పోటీల్లో పాల్గొని విజేతలుగా నిలిచే సత్తా ఉన్న వారు అనేక మంది ఉన్నారని, అందరూ పోటీలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. సమావేశంలో జాయింట్ జిల్లా రెవెన్యూ అధికారి కె.హేమలత, కేఆర్‌ఆర్‌సీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ పి.ధర్మచంద్రారెడ్డి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి ఎస్ భాస్కరరావు, డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ ఎం.సుధారాణి, జిల్లా గ్రామ పంచాయతీ అధికారి తమర్భ కొండలరావు, జిల్లా ఉద్యాన అధికారి బి.శ్యామల, జిల్లా మహిళా శిశు సంక్షేమ, సాధికారిత అధికారి డా.టి.కనకదుర్గ, జిల్లా గిరిజన సంక్షేమ, సాధికారత అధికారి ఎస్.కష్ణవేణి, జిల్లా సాంఘిక సంక్షేమ సాధికారత అధికారి ఎం.డి.గయాజుద్దీన్, జిల్లా బీసీ సంక్షేమ సాధికారత అధికారి ఎస్.కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

నకిలీ పట్టాలతో మోసగించిన మహిళ

- పట్టాలిప్పిస్తానని పలువురి వద్ద వసూళ్లు
- బాధితుల ఫిర్యాదు మేరకు కేసునమోదు, రిమాండ్‌కు తరలింపు

పార్వతీపురం రూరల్: సొంతింటి కల నెరవేర్చుకుందామనే వారి ఆశను పెట్టుబడిగా నకిలీ పట్టాలతో ఓ మహిళ మోసగించి భారీగా వసూలు చేసిన ఘటన పార్వతీపురం జిల్లా కేంద్రంలో జరిగింది. కష్టపడి కొంతమొత్తాన్ని కూడబెట్టి, ఇంకొంత అప్పులు చేసి సొంతింటి కల నెరవేరుతుందన్న ఆశతో ఉన్నవారిని పసిగట్టి నమ్మకం కలిగించి అధికారంలో ఉన్న నాయకుడికి తాను ఎంత చెబితే అంత అని బాధితులను నమ్మించి లక్షల రూపాయలు వసూలు చేసి..టిడ్కో గృహ సముదాయాల్లో ఇంటిని ఇప్పిస్తానని నమ్మబలికింది. ఈ ప్రక్రియలో భాగంగా నకిలీ స్టాంపులను తయారు చేసి నకిలీ పట్టాలను ఏడుగురు బాధితులకు పంపిణీ చేసింది. అయితే ఆ పట్టాలు నకిలీవని తేలి..ఎప్పటికీ టిడ్కోలో గృహాల కేటాయింపు కాకపోవడంతో తాము మోసపోయామని గమనించిన బాధితులు పోలీసులను ఆశ్రయించారు. ఈ మేరకు పట్టణంలోని సాయినగర్ కాలనీకి చెందిన కల్లూరు సురేష్ ఈనెల 11న ఇచ్చిన ఫిర్యాదు మేరకు ప్రాథమిక దర్యాప్తు నిర్వహించిన అనంతరం మంగళవారం పార్వతీపురం పట్టణానికి చెందిన పద్మాంబికతో పాటు మరో ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై జగదీష్ నాయుడు విలేకరులకు తెలిపారు. ఈ మేరకు నిందితురాలు పద్మాంబికను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు. నిందితురాలు పద్మాంబిక అధికార టీడీపీకి చెందిన ప్రముఖ నాయకుల కనుసన్నల్లోనే ఈ వ్యవహారమంతా నడిపి ఉంటుందని స్థానికులు, బాధితులు చర్చించుకుంటున్నారు.

బడుగులపై పిడుగు



సన్నిబాబు (ఫైల్)



పిడుగుపాటు బలైన కాడెద్దు

లక్కవరపుకోట/బొబ్బిలిరూరల్: వాతావరణ ప్రభావంతో కురుస్తున్న వర్షాల సందర్భంగా పడుతున్న పిడుగులు బడుగులను ఆందోళనకు గురిచేస్తున్నాయి. మంగళవారం జిల్లాలో పడిన పిడుగులకు లక్కవరపుకోట మండలంలోని చందులూరు గ్రామం శివారు కళిరెడ్డిపాలెం గ్రామానికి చెందిన కళిరెడ్డి సన్నిబాబు(60) మృత్యువాత పడ్డాడు. సన్నిబాబు తన పాడిగేదెలను గ్రామం సమీపంలో గల పొలంలో మేపుతుండగా ఒక్కసారిగా మెరుపులు పెద్దపెద్ద ఉరుములతో భారీ వర్షం కురిసింది. దీంతో సమీపంలో పిడుగుపడడంతో అక్కడికక్కడే కుప్పకూలిపోయాడు. అలాగే బొబ్బిలి మండలంలోని గోపాలరాయుడుపేట పంచాయతీ పరిధి రాజుపేట గ్రామంలో పిడుగుపాటుకు గురై రెండు కాడెద్దు మృత్యువాతపడ్డాయి. గ్రామానికి చెందిన రైతు కోరెడ్ల బంగారునాయుడు తన ఎడ్లతో ఏరుపూసి మంగళవారం సాయంత్రం పొలం దున్నేందుకు వెళ్తుండగా మార్గమధ్యంలో అకస్మాత్తుగా కమ్ముకున్న మేఘాలు, ఉరుములతో పిడుగుపడింది. దీంతో బంగారునాయుడు ప్రమాదం నుంచి త్రుటిలో తప్పించు కోగా రెండు కాడెద్దు అక్కడికక్కడే మృతిచెందాయి. ఈ సంఘటనతో రైతు లబోదిబోమన్నాడు. నిరుపేద కుటుంబానికి చెందిన తనకు ప్రభుత్వం నుంచి సహాయం అందేలా చూడాలని అధికారులను కోరాడు.

గుర్తు తెలియని మృతదేహం



తాడేపల్లి గూడెం సమీపంలో రైల్వేట్రాక్ పక్కన మృతదేహం

బొబ్బిలి: తాడేపల్లి గూడెం పరిధిలో ట్రైన్ ఢీకొని ఓ గుర్తు తెలియిన వ్యక్తి మృతి చెందాడు. సోమవారం జరిగిన ఈ సంఘటన వివరాలిలా ఉన్నాయి. మృతి చెందిన వ్యక్తి వద్ద నూజివీడు నుంచి బొబ్బిలికి కొనుగోలు చేసిన టికెట్ లభ్యం కావడంతో అక్కడి పోలీసులు బొబ్బిలి జీఆర్‌పీ సిబ్బందికి సమాచారం అందజేశారు. ఫొటోలను పంపించి ఆచూకీ కనుగొనాలని కోరడంతో స్థానిక జీఆర్‌పీ సిబ్బంది విలేకరులకు తెలియజేశారు. బొబ్బిలి లేదా పరిసర గ్రామాలకు చెందిన వ్యక్తి అయి ఉండొచ్చని భావిస్తున్నారు. ఎవరైనా మృతుడిని గుర్తిస్తే బొబ్బిలి రైల్వే పోలీసులను సంప్రదిస్తే ఆ సమాచారి తాడేపల్లి గూడెం పంపించేందుకు అవకాశముంటుందని స్థానిక జీఆర్‌పీ సిబ్బంది తెలిపారు.

ఖరీఫ్ సీజన్ త్వరగా మొదలు పెట్టాలి

- కలెక్టర్ బీఆర్ అంబేడ్కర్



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ అంబేడ్కర్

విజయనగరం ఫోర్ట్: ప్రకృతి అనుకూలత వల్ల ఈఏడాది ముందుగానే వర్షాలు మొదలయ్యాయని వీలైనంత వేగంగా విత్తనాలు జల్లి ఖరీఫ్ సీజన్ మొదలుపెట్టాలని కలెక్ట బీఆర్ అంబేడ్కర్ అధికారులకు సూచించారు. ఈ మేరకు మంగళవారం ఆయన వ్యవసాయ అధికారులు తహసీల్దార్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌కు అవసరమైన విత్తనాలు, ఎరువులు సిద్ధంగా ఉన్నాయన్నారు. ఆక్టోబర్ లోగా కోతలు పూర్తి చేసేవిధంగా వీలైనంత త్వరగా విత్తనాలు జల్లాలని సూచించారు. దీనివల్ల నవంబర్‌లో వచ్చే తుఫాన్ల ముప్పు నుంచి తప్పించుకోవచ్చని అభిప్రాయ పడ్డారు. తద్వారా రబీసీజన్ కూడా వీలైనంత త్వరగా మొదలు పెట్టే అవకాశం కలుగుతుందన్నారు.

కౌలు రైతులకు రుణాలు

జిల్లాలో ఈఏడాది సుమారు 16,500 మంది కౌలు రైతులకు గుర్తింపు కార్డులు జారీచేసి, వారికి రూ.150 కోట్ల రుణాలను ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. జూన్ మొదటి వారంలోగా ఈ గుర్తింపు కార్డుల పంపిణీ పూర్తి చేయాలన్నారు. అన్నదాత సుఖీభవ కోసం సుమారు 4,89,116 మంది రైతుల వివరాలను తనిఖీ చేసి అర్హుల జాబితా ఎంపిక ప్రక్రియను రెండు రోజుల్లో పూర్తి చేయాలని ఆదేశించారు. మండల వ్యవసాయ అధికారుల లాగిన్‌లో పెండింగ్‌లో ఉన్న రోజుల్లోనే తనిఖీ పూర్తి చేసి అమోదం తెలపాలని స్పష్టం చేశారు. రైతుల అధార్ కార్డుల సవరణ, మార్పులు, చేర్పులపై దృష్టి పెట్టాలని సూచించారు. పీజీఆర్ఎస్‌లో రెవెన్యూకు సంబంధించి 1017 అర్జీలు పెండింగ్‌లో ఉన్నాయని వాటిని వారం రోజుల్లో పరిష్కరించాలని సూచించారు. పెండింగ్ ఎక్కువగా ఉన్న తహసీల్దార్లపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సమావేశంలో జేసీ సేతు మాధవన్, డీఆర్ఓ మురళి, జిల్లా వ్యవసాయ అధికారి వి.తారకరామారావు, ఎల్‌డీఎం నారాయణమూర్తి, ఏపీ సీడ్స్ డీఎం పద్మ, మార్క్‌ఫెడ్ డీఎం వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

బదిలీల్లో లోపాలను కమిషనర్ దృష్టికి తీసుకువెళ్లండి

- ఉపాధ్యాయ ఎమ్మెల్సీని కోరిన పీఆర్‌టీయూ



ఎమ్మెల్సీ గాదెకు సమస్యలు వివరిస్తున్న పీఆర్‌టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు అల్తి రాంబాబు, తదితరులు

మెరకముడిదాం: ఉపాధ్యాయుల బదిలీల్లో అసంబద్ధమైన విషయాలను కమిషనర్ దృష్టికి తీసుకువెళ్లి ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులునాయుడిని పీఆర్‌టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు అల్తిరాంబాబు కోరారు. ఈ మేరకు మంగళవారం ఆయన విజయనగరంలో ఎమ్మెల్సీ గాదెను ఆయన ఇంటివద్ద కలిసి ఎస్టీటీ ఉపాధ్యాయులు బదిలీల్లో ఎదుర్కొంటున్న అనేక సమస్యలను వివరించారు. వాటిని వెంటనే కమిషనర్ స్థాయిలో పరిష్కరించాలని కోరారు. ఈ విషయంలో ఎస్టీటీలకు ఎలాంటి అన్యాయం జరగకుండా చూడాలని విజ్ఞప్తి చేశారు. ఆయన వెంట పీఆర్‌టీయూ నాయకులు కృష్ణమూర్తి, రామకృష్ణ ఉన్నారు.

ఫ్లోరైడ్ శాతం ఎక్కువగా ఉన్న గ్రామాల గుర్తింపు

- డీఎంహెచ్‌ఓ డాక్టర్ జీవనరాణి

విజయనగరం ఫోర్ట్: జిల్లాలోని రాజాం, సంతకవిటి, వంగర, ఆర్. ఆముదాలవలస మండలాల్లోని 25 గ్రామాల్లో సర్వే చేసి నీటిలో ఫ్లోరైడ్‌శాతం ఎక్కువగా ఉన్న గ్రామాలను గుర్తించినట్లు డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎస్. జీవనరాణి తెలిపారు. ఈ గ్రామాల్లో నివసిస్తున్న జనాభాలో 30 మంది పిల్లలను, 58 పెద్ద వారిని ఫ్లోరైడ్ అనుమానిత బాధితులుగా గుర్తించామన్నారు. వారిలో ముగ్గురుపిల్లలు, ఆరుగురు పెద్ద వారికి డెంటల్ ఫ్లోరోసిస్ ఉన్నట్లు గుర్తించామని చెప్పారు. ఇద్దరు పెద్ద వారికి ఫ్లోరోసిస్ ఉన్నట్లు గుర్తించామన్నారు. వారికి కాల్షియం మల్టీ విటమన్ టాబ్లెట్లు అందించామని తెలిపారు. నడవలేని వారికి వీల్‌చైర్స్, టాయిలెట్ కమోడ్స్ ఇచ్చామన్నారు. ఆ గ్రామాలకు వెళ్లి ఫ్లోరైడ్ ఎక్కువగా ఉండడానికి కారణాలపై, ఎలాంటి ఆహార పదార్థాలు తీసుకోవాలి? ఎలాంటి ఆహార పదార్థాలు తీసుకోకూడదనే అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించినట్లు చెప్పారు. ఫ్లోరైడ్ శాతం అధికంగా ఉండే పదార్థాలైన బ్లాక్ సాల్ట్ వాడే పానీపూరీ, కురుకురే, చాట్, మురీమిక్చర్ వంటివన్నారు. కాల్షియం అధికంగా ఉంటే ఆకుకూరలు, నువ్వులు, గుడ్లు ఎక్కువగా తీసుకోవాలని సూచించారు.

అవగాహన విజయవంతం చేయాలి



పోస్టర్‌లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ ఎ. శ్యామ్ ప్రసాద్

పార్వతీపురంటౌన్: ధర్తీ ఆబాజన్ జాతీయ గ్రామ ఉత్కర్ష్ అభియాన్ (డీఏజేజీయూఏ) అవగాహన కార్యక్రమాలను విజయవంతం చేయాలని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ తెలిపారు. జూన్ 15 నుంచి 30 వరకు అవగాహన కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు చెప్పారు. మహిళా శిశు సంక్షేమ శాఖ, గ్రామీణ నీటి సరఫరా విభాగం అధికారులతో మంగళవారం కలెక్టరేట్‌లో సమన్వయ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రధాన మంత్రి జన్‌జాతి ఆదివాసీ న్యాయ మహా అభియాన్ ధర్తీ ఆబాజన్ జాతీయ గ్రామ ఉత్కర్ష్ అభియాన్ కార్యక్రమాలను త్రికరణ శుద్ధితో అమలు చేసేందుకు కృషి చేస్తోందన్నారు. దేశవ్యాప్తంగా గిరిజన ప్రాంతాలలో సేవలు, మౌలిక సదుపాయాలను కల్పించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాలు చేపట్టనున్నట్లు చెప్పారు. గ్రామ స్థాయి/క్లస్టర్ స్థాయి శిబిరాల ద్వారా వివిధ సౌకర్యాలను క్షేత్ర స్థాయిలో అందించేందుకు ఉద్దేశించినట్లు తెలిపారు. ఆధార్ కార్డ్, రేషన్ కార్డ్, ఆయుష్మాన్ భారత్ కార్డ్, కుల ధ్రువీకరణ, నివాస ధ్రువీకరణ పత్రాలు, కిసాన్ క్రెడిట్ కార్డ్ పీఎం కిసాన్ కార్డులు, జన్ ధన్ ఖాతా, పీఎం జేజేబీవై, పీఎంఎస్ బీవై బీమా కవరేజ్, వృద్ధాప్య, వితంతు, దివ్యాంగ సామాజిక భద్రత పింఛన్లు, ఉపాధి హామీ, పీఎం విశ్వకర్మ, ముద్ర తదితర జీవనోపాధి పథకాలు, పీఎం ఎంఎవై, ఇమ్యునైజేషన్ తదితర స్త్రీ శిశు సంక్షేమ ప్రయోజనాలు అందించనున్నట్లు పేర్కొన్నారు.

పోషకాహార ప్రదర్శనల ఏర్పాటు

గ్రామస్థాయిలో ఆధార్‌లో నమోదు కానివారిని అంగన్వాడీ సిబ్బంది నమోదు చేయించాలని ఆదేశించారు. చిరుధాన్యాలతో తయారు చేసిన ఆహార పదార్థాల పోషక విలువలు తెలియజేసేందుకు ప్రదర్శనలు ఏర్పాటు చేయాలని సూచించారు. పాడైన గుడ్లను ఎట్టి పరిస్థితుల్లోను అంగన్వాడీ కేంద్రాల్లో పంపిణీ చేయరాదని ఆదేశించారు. రక్తహీనత లేకుండా దృష్టి సారించాలని, ప్రసవ తేదీలను ముందుగానే గుర్తించి ఆస్పత్రిలో చేర్పించాలని చెప్పారు. ఎక్కడా అవాంఛనీయ సంఘటనలు జరగరాదని ఆయన స్పష్టం చేశారు. పుట్టిన బిడ్డకు పాలు పట్టే విధానం తెలియక పోవడం వల్ల కూడా కొన్ని శిశు మరణాలు జరుగుతున్నాయని, పాలు పట్టే విధానం పట్ల అవగాహన కల్పించాలని ఆయన సూచించారు. గిరి చైతన్యం డిజిటల్ మీడియా వాహనం ద్వారా కూడా పలు అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నట్లు ఆయన చెప్పారు.

సాక్షి క్లాసిఫైడ్స్

WANTED

- హరేకృష్ణ హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్లను, చంటి పిల్లలను చూసుకొనుటకు వర్కర్స్/నర్సులు కావలెను. ఉచిత వసతి భోజనం జీతం: 18k. Ph: 9640258899, 9640468899 [HA-1909]
- కన్సల్టెన్సీ కాదు VIP ఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి స్త్రీలు/ పురుషులు, ఆయా, నర్సులు, వంట వారు,RMP&డాక్టర్స్ కావలెను.జీ: 15 వేలు -40వేలు,ఫ్రీరూం+భోజనం.Hyd.8317512135 [HA-15904]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.